క్లుప్తంగా

ఎక్సైజ్ సీఐగా నాగేశ్వరరావు



ఆలమూరు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఐడీ నాగేశ్వరరావు సోమవారం నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఐ.పోలవరం మండలంలోని ఎదుర్లంక ఎక్సైజ్ చెక్‌పోస్టు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆలమూరులో ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించిన సత్యవేణి విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ సారా, ఇతర మాదక ద్రవ్యాల కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటిని పూర్తిస్థాయిలో అదుపు చేస్తానని నాగేశ్వరరావు తెలియజేశారు.

ట్రాన్స్‌కో జేఈగా దుర్గాప్రసాద్



ఆలమూరు: స్థానిక సబ్‌స్టేషన్ జేఈగా డీఎంకె.దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా బిక్కవోలు నుంచి ఆయన స్థానిక సబ్‌స్టేషన్‌కు వచ్చారు. గత రెండేళ్ల నుంచి జేఈ పోస్టు ఖాళీగా ఉండటంతో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వై.లక్ష్మి ఇప్పటి వరకూ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

డిగ్రీ విద్యార్థులకు రక్త పరీక్షలు



కొత్తపేటలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న జువాలజీ విద్యార్థులు

కొత్తపేట: వివిధ ప్రమాదాలు, అనారోగ్య కారణాలతో అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా వారి ప్రాణాలు కాపాడాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల జువాలజీ విభాగం, రావులపాలెం శ్రీచక్ర ఒకేషనల్ జూనియర్ కళాశాల ఎంఎల్‌టీ లెక్చరర్ బి.ప్రమీల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. దీనిలో బ్లడ్ గ్రూపు నిర్ధారణ, ఇతర పరీక్షలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సత్యనారాయణ, బి.విజయకుమార్, ప్రసన్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెకుముకి పరీక్ష

మలికిపురం: మండలస్థాయి చెకుముకి పరీక్ష మంగళవారం ఉదయం 10 గంటలకు జెడ్పీ ఉన్నత పాఠశాల బట్టేలంకలో జరుగుతాయని మండల జనవిజ్ఞానవేదిక(జేవీవీ) సోమవారం తెలిపింది. పాఠశాల 8, 9, 10 తరగతుల విద్యార్థులు ప్రధానోపాధ్యాయుల సంతకంతో విద్యార్థులను తీసుకుని ఉదయం 9.30 గంటలకు బట్టేలంక హైస్కూల్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరీక్ష అనంతరం రిజల్ట్, బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయన్నారు.

దివ్యాంగుల రిలే దీక్ష

మామిడికుదురు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా అప్పనపల్లిలో దివ్యాంగులు సోమవారం ఒక రోజు దీక్ష చేపట్టారు. బాలబాలాజీ స్వామి ఆలయం వద్ద చేపట్టిన ఈ దీక్షలో రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగులు కొమ్ముల కోటేశ్వరరావు, బొమ్మిడి నరసింహస్వామి, కట్టా త్రినాథ్, చిట్టూరి రాంబాబు, కోడేటి పాండురాజు పాల్గొన్నారు. జనసేన మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరావు, పి.గన్నవరం నియోజకవర్గం సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, కంకిపాటి నరసింహారావు, తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

అనకాపల్లిలో జాతీయ కవితోత్సవం



అనకాపల్లిలో ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఉత్తరాంధ్ర కవులు

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లిలో జిల్లా గౌరీ గ్రంథాలయ ఆడిటోరియంలో నూకాంబిక జాతీయ కవితోత్సవాన్ని సదరు కవులు ఘనంగా నిర్వహించారు. వివరాలను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్, కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సోమవారం వివరించారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన సీనియర్ కవులు తమ కవితల ద్వారా సభికులను మంత్రముగ్ధులను చేశారు. వేదికపై డాక్టర్ ప్రతాప్‌ను ఉత్తరాంధ్ర కవులు గజమాలతో ఘనంగా సత్కరించారు. సాహిత్య సేవలను నిరంతరం చేయడం ప్రతాప్‌కే సాధ్యమని వారు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర వేదిక అధ్యక్షుడు ఈ.వేమన, శ్రీశ్రీ కళావేదిక కార్యవర్గ మెంబర్‌లు జీఎల్ఎన్ శాస్త్రి, గంపా శ్రీదేవి, కోరాడ అప్పలరాజు, ధర్మారావు, మల్లీశ్వరి పాల్గొన్నారు.

క్షీణిస్తున్న పశుసంపద

- కబేళాకు తరలిపోతున్న వైనం
- పేరవరం కేంద్రంగా తరలింపు



కబేళాకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న పశువులు

ఆత్రేయపురం: పాడి పరిశ్రమతో ఒకప్పుడు కళకళలాడిన ఈ ప్రాంతం ప్రస్తుతం నేడు పాడిలేక వెలవెలబోతుంది. ఇందుకు కారణం ప్రభుత్వ ప్రోత్సాహం కరవవ్వడంతో రైతులు పాడి వైపు దృష్టి సారించడం లేదు. మండలంలో పశు వైద్యాధికారులు ఉన్నా నియంత్రణ చేయలేకపోవడంతో రోగాలు ప్రబలి పశువులు మృత్యువాత పడుతున్నాయి. అనవసరంగా లేగదూడలను దళారులు కబేళాకు తరలించి సొమ్ములు చేసకుంటున్నారు. పాడి పరిశ్రమకు ఆలవాలంగా నిలిచిన ఆత్రేయపురం మండలం నేడు పశుపోషణపై శ్రద్ధ కనిపించడం లేదు. ఆత్రేయపురం మండలం పేరవరం కేంద్రంగా మంగళవారం, శుక్రవారం పశువులు కబేళాకు తరలిపోతున్నాయి. కబేళాకు తరలిపోతున్న పశుసంపదను కాపాడేందుకు అధికారులు సైతం కిమ్మనడం లేదు. పశువులను కబేళాకు తరలించడం తీవ్రమైన నేరం. ఇక్కడ నుంచి తరలిపోతున్న పశువులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలో అమ్మకాలు సాగిస్తున్నారు. ఆత్రేయపురం గతంలో పశు గణాంకాల ప్రకారం మండలంలో సుమారు 14 వేల పశువులుండగా ప్రస్తుతం అవి 8 వేలకు చేరాయి. అందులో సుమారు 5500 గేదెలు, 2500 ఆవులున్నాయి. దీనివల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. మండలంలో ఆత్రేయపురం, అంకంపాలెం, ర్యాలి తదితర గ్రామాల్లో పలువురు రైతులు లాభనష్టాలతో నిమిత్తం లేకుండా పశువుల పెంపకాన్ని సాగిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో తగిన పాల సరఫరా లేక పల్లె వాసులు కూడా పాలప్యాకెట్లపై ఆధారపడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పాడిరైతులకు చేరకపోవడం వల్లే వారు విముఖత చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశువైద్య కేంద్రాలు, మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల ద్వారా పశుగ్రాస విత్తనాలు, దాణాను ప్రభుత్వం రాయితీపై ఇస్తున్నా అవి పాడిరైతులకు చేరడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. మండలంలో ఉన్న పాడి పశువుల గణాంకాలకు, వాస్తవంగా ఉన్న పశువులకు పొంతన లేదనే విషయం పాల దిగుబడిని బట్టి తెలుస్తోంది. దీంతో పల్లె ప్రాంతాల్లో న్యూస్ పేపర్ మాదిరిగా పాలప్యాకెట్ కూడా గుమ్మం వద్ద వచ్చి చేరుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టి పాడి పరిశ్రమకు చేయూతను అందించి సామాన్య రైతులు పాడి పంటలపై దృష్టి సారించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పేరవరం-బొబ్బర్లంక రహదారికి అటంకాలు



పేరవరం సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై పాడి పశువులను రోడ్లకు ఇరువైపులా వాహనాల రవాణాకు అడ్డంకిగా నిలిపి ఉంచుతున్నారు. అంతేకాకుండా రెండు వైపులా పశువుల వ్యర్థాల గుట్టలు వేసి తొలగించడం లేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహన దారులు, ఆర్టీసీ బస్సుల సేవలకు తీవ్ర అడ్డంకి ఏర్పడుతుంది.

– దండు బాబు, ఆత్రేయపురం

కబేళాకు తరలించడం నేరం



ఆవు, గేదేల దూడలు, పాడి పశువులు కబేళాకు తరలించడం నేరం. పేరవరం సమీప గ్రామాల్లో కొందరు దళారులు పాడిపశువులు, ఆవు, గేదె దూడలను కబేళాకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. దూడల విక్రయం కారణంగా ఈ ప్రాంతంలో పశు సంపద అంతరించి పోతుంది. జీవహింస పెరుగుతుందని ఆవులను కబేళాకు విక్రయించడం మహాపాపమని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు.

– పసలపూడి కుమార్, ర్యాలి

కొత్తపేట

ఎక్సైజ్ సీఐగా కాత్యాయని



కొత్తపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా కె.కాత్యాయని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన డి.సురేఖ కృష్ణా జిల్లా గన్నవరం బదిలీ కాగా ఆమె స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు సీఐగా పనిచేసిన కాత్యాయని కొత్తపేటకు బదిలీపై వచ్చారు. కాత్యాయని గతంలో ఇక్కడ ఎక్సైజ్ ఎస్సైగా పనిచేశారు. నూతన సీఐగా బదిలీపై వచ్చిన ఆమెకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాత రవికిరణ్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రి వాస్తవ్యులు దూళిపాల రవి కిరణ్, ఆయన కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌కు అభినందనలు



బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రరావును అభినందిస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రం (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌గా డాక్టర్ యు.రాఘవేంద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇక్కడ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులుగా సేవలు అందిస్తున్నారు. ఇంతవరకూ డాక్టర్ కోటేశ్వరరావు సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆయన స్థానంలో రాఘవేంద్రరావును నియమిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రరావును సీహెచ్‌సీ వైద్య సిబ్బంది అభినందించారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నేత మృతి

అంబాజీపేట: నందంపూడి అమ్మవారితోటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రాయుడు శ్రీనివాసరావు సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోసంగి బాబులు, పార్టీ నేతలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో పార్టీ నేతలు పెచ్చెట్టి రాంబాబు, పితాని రమణ, కుడుపూడి సతీష్, పెచ్చెట్టి వీరాస్వామి తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

రాజోలు: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై సోంపల్లి పంచాయతీ వద్ద సోమవారం అవగాహన సదస్సు జరిగింది. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా జరిగిన సదస్సులో ఎంపీడీఓ ఎస్.బాలాజీ, ఈఓపీఆర్డీ గిడ్ల భీమారావులు చట్టాలపై అవగాహన కల్పించారు. మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు, పంచాయతీ కార్యదర్శి కె.గణపతిరావు, వీఆర్వో తరుణ్‌రాజు, నాయకులు విప్పర్తి సాయిబాబు, శంకరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను ఒడిసి పడితేనే ఉద్యోగాలు



మామిడికుదురులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీవన్‌వర్మ

మామిడికుదురు: డిగ్రీలో ఉండగానే సాంకేతిక, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను ఒడిసి పడితేనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందడం సులభమవుతుందని ఏఎంఎస్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీఈఓ జీవన్‌వర్మ సూచించారు. మామిడికుదురు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగ సాధన సదస్సులో ఆయన మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లు కోడింగ్, ప్రోగ్రామింగ్ ద్వారా సాఫ్ట్‌వేర్ పరిష్కారాలకు జీవం పోస్తారని, అందుకే విద్యార్థులంతా ఆ దిశగా సంసిద్ధం కావాలన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు అవసరమైన నైపుణ్యాలలో కోడింగ్, ఎన్‌క్రిప్షన్, డీబగ్గింగ్ వంటి సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్, సమస్యలను పరిష్కరించడం వంటి సాఫ్ట్ స్కిల్స్ ఉంటాయని తెలిపారు. వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్స్ సైన్స్ విభాగాధిపతి కోడూరి వెంకటేష్, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ హెచ్ఓడీ డాక్టర్ విజయ్‌సత్యప్రసాద్, ఏఎంఎస్ సంస్థ సాంకేతిక నిపుణులు బి.శిరీష, పి.జగదీష్ వర్మ, అర్.సత్యసాయిరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం



ఉపాధ్యాయిని వెంకటలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ తదితరులు

కొత్తపేట: మండలంలోని మందపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఏ ఉపాధ్యాయిని భారం వెంకటలక్ష్మి ఉద్యోగ విరమణ సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, చింతం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభకు పాఠశాల హెచ్ఎం బండారు వెంకటదుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా ఎంఈఓలు హరిప్రసాద్, లీలావతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ మందపల్లి పాఠశాలలో వెంకటలక్ష్మి ఎస్ఏ టీచర్‌గా పనిచేస్తూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దారన్నారు. వారి విద్యాబోధన ఆదర్శనీయమన్నారు. అనంతరం వెంకటలక్ష్మి-సత్యప్రసాద్ దంపతులను అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి, వీడీసీ కన్వీనర్ సాదు చెంచయ్య, మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణమోహన్, ఎంపీటీసీ సిద్దంశెట్టి వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నగరంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. నగరం ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో స్వచ్ఛతాహి సేవలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వచ్ఛతాహి సేవలో ప్రజలు భాగస్వాములయ్యేలా కార్యాచరణ చేపట్టారని ఎమ్మెల్యే తెలిపారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతోనే వాతావరణంలో సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ జాలెం రమణకుమారి, ఓఎన్జీసీ ఏరియా మేనేజర్ కేజేఎం రావు, ఇన్‌స్టలేషన్ మేనేజర్ ఎస్‌వీఆర్ శివకుమార్, రెసిడెంట్ ఇంజినీర్ హరికేష్ రెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు. లూటుకుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ఎంసీ చైర్మన్ బోణం సత్యరాజు అందించిన మొక్కలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం 300 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. పచ్చదనం, పరిశుభ్రతలో భాగంగా స్కూల్ విద్యార్థులకు మొక్కలు అందించడం జరిగిందని చైర్మన్ సత్యరాజు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబు, సర్పంచ్ అడబాల తాతకాపు, బోణం బాబు, విళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరసింహదేవర వర్థంతి



మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ సిబ్బంది

ఆలమూరు: దేశ సహకార సంఘ ఉద్యమ పితామహుడు, మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవర సత్యనారాయణమూర్తి వర్థంతి సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక బొబ్బా చిన వీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో పర్సన్ ఇన్‌చార్జి డి.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రైతులు విచ్చేసి మాజీ ఎమ్మెల్సీ నరసింహదేవరకు ఘన నివాళులు అర్పించారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆలమూరులో కోఆపరేటివ్ బ్యాంకును స్థాపించి సహకార స్ఫూర్తికి దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన నరసింహదేవరను ఈసందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. అనంతరం సొసైటీ సిబ్బంది నరసింహదేవర చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

తాగునీటి సమస్యలకు పరిష్కారం



పల్లిపాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: రాజోలు నియోజక వర్గంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మలికిపురం మండలం, గూడపల్లి పల్లిపాలెంలో వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల తరబడి ఎదుర్కొన్న మంచినీటి సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, వైస్ ఎంపీపీ సుందర శ్రీనివాస్, సర్పంచ్ పెచ్చెట్టి నరసింహా స్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే శంకరగుప్తం ఎత్తిపోతల పథకాన్ని కూడా ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి ప్రాజెక్టు అభివృద్ధి చర్యలకు సూచనలు చేశారు. కేశనపల్లి యడ్లవారి గ్రూపులో డ్రైన్‌ను పరిశీలించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు యెనుముల నాగు, రాపాక ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్ బాధితురాలికి సాయం



గొందిలో బాధిత బాలిక కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్న బుజ్జిరాజు

సఖినేటిపల్లి: కరెంటు షాక్ బాధిత విద్యార్థిని బర్రే దుర్గాభవానికి, కువైట్ కేంద్రంగా ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సోమవారం రూ.25 వేల ఆర్థికసాయం చేసింది. గొందికి చెందిన దుర్గాభవాని ఇటీవల కరెంట్ షాక్‌కు గురై కాకినాడలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు పై సాయాన్ని బాధిత బాలిక కుటుంబ సభ్యులకు ఇంటి వద్ద వసుధ ఫౌండేషన్ నియోజకవర్గ కన్వీనర్ జంపన బుజ్జిరాజు చేతుల మీదుగా అందజేశారు. అలాగే మాజీ ఎంపీటీసీ కొక్కిరిగడ్డ శ్రీనివాస్ సొంతంగా సమకూర్చిన రూ.5 వేలు అందజేశారు. సర్పంచ్ డి.రవికుమార్, హెల్పింగ్ హ్యాండ్స్ స్థానిక మెంబర్ నల్లి ప్రసాదరావు, ప్రతినిధులు గంటా భాస్కరరావు, ముత్యాల శ్రీనివాసరావు, రాపాక చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక



అంబాజీపేట మండల మాల మహానాడు నూతన కార్యవర్గం

అంబాజీపేట: మండల మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని 16 గ్రామాలకు చెందిన దళిత నాయకులు, యువకులు అంబాజీపేట జయంతి నగర్ వ్యవసాయ క్షేత్రంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా నాగవరపు నాగరాజు, ఉపాధ్యక్షుడిగా నెల్లి వెంకటరమణ, కార్యదర్శిగా నాగాబత్తుల సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా బీర సురేష్, కోశాధికారిగా కోట హనుమంతరావు, సభ్యుడిగా గోసంగి కుమారస్వామిలను ఎన్నుకున్నారు. సమావేశంలో నూకపెయ్యి చిన్న, గోసంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలం గోపాలపురం గ్రామానికి చెందిన అడబాల వెంకటేశులు గత రెండేళ్లుగా పక్షవాతంతో చేయి, కాలు పని చేయక ఇంట్లోనే ఉంటున్నారు. ఇతని భార్య ఆరోగ్యం కూడా ఇటీవల క్షీణించింది. సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నారు. వీళ్లని పోషించేవారు ఎవరూ లేక ఇబ్బందులు పడుతుండటంతో కాశీఅన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. గోపాలపురంలోని వెంకటేశులు ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 25 కేజీల బియ్యం బస్తా ఇచ్చారు.

ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, నాన్ పర్మినెంట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని జేసీ నిశాంతికి అందించారు. ఆందోళనలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అధ్యక్షుడు ఎ.దుర్గాప్రసాద్, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఓ.కృష్ణవేణి తదితరులు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులు చేసే పనినే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో చేయిస్తున్నప్పుడు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు 2013లో ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అన్ని శాఖల్లో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు ఉద్యోగుల శ్రమను దోచుకోవడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యేలు మాత్రం నెల జీతం రూ.2 లక్షలు తీసుకుంటుంటే, కనీస వేతనం రూ.26 వేలు మాత్రమే అడుగుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి గణపతి, ఉపాధ్యక్షుడు ఏడుకొండలు, మేరి, వరలక్ష్మి, పాలమూరి శ్రీను, శ్రీనివాస్, ఆదిలక్ష్మి, మహాలక్ష్మి, స్వాతి, గీత తదితరులు పాల్గొన్నారు.

భోజనశాలకు భూమి పూజ



భోజనశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం భోజనశాల నిర్మాణానికి సోమవారం స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. పూర్వ విద్యార్థులు అంబటి మురళి, గుబ్బల సూర్యప్రకాష్, ఎస్ఎస్ఎస్ మాస్టర్, ఫణి మాస్టర్, గిడ్ల వెంకటేశ్వరరావు, పాబోలు సుబ్రహ్మణ్యం, ముషిణి రామకృష్ణ ఈ భోజనశాలకు ఆర్థిక సాయం అందజేశారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడుపూడి శాంతావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కేఎస్ఆర్ మెగా కాంప్లెక్స్ ఏరియా, వెదిరేశ్వరం రోడ్డు, కొత్త కాలనీ, రావులపాడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తపేట మండలంలో..

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. డీటీఆర్ మరమ్మతుల నిమిత్తం కొత్తపేట పంచాయతీ పరిధిలోని కమ్మిరెడ్డిపాలెం, తాళ్లమ్మ గుడి, హైస్కూల్ రోడ్డు, కోర్టు ప్రాంతాలకు, వాడపాలెం గ్రామానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

తాళ్లరేవు: వరద కారణంగా ముంపునకు గురైన పంట పొలాలకు సంబంధించి ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కౌలు రైతు సంఘం, సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల భవనం వద్ద సోమవారం సీపీఎం పార్టీ మహాసభ చల్లా సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సీపీఎం జెండాను పలివెల సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట దెబ్బతిన్న పొలాలకు తక్షణమే నష్ట పరిహారం, పెట్టుబడి సాయం రూపేణా ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేలు రైతులకు ఇవ్వాలన్నారు. రాబోయే మూడేళ్లకు శాఖ కార్యదర్శిగా రాజబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, కేఎస్ శ్రీనివాస్, మండల కార్యదర్శి టి.ఈశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.